# బొమ్మల చొక్కా

రోజూ ఉదయం లేస్తూనే తమ గుడిసెకి కాస్త దూరంలో ఉన్న మర్రి చెట్టు తిన్నెమీద కూర్చుని, తన చిన్న రేకు పెట్టెలో కూడబెట్టిన చిల్లర డబ్బుల్ని పోగు పోసుకుని లెక్కబెట్టుకోవడం, కొన్ని నెలలుగా వెంకడి దినవారీ కార్యక్రమంలో ఒక భాగంగా మారింది.

ఆ రోజు వాడు అలవాటుగా డబ్బులు లెక్క చూసుకుంటుంటే పొరుగింటి ఎల్లమ్మ చెమ్మట్టుకి పొలాలకి అడ్డం పడిపోతూ, "ఏట్రా ఎంకా, డబ్బు కూడెడ్తున్నావ్, పెళ్లికే నేటి?" అంది పరిహాసంగా.

వెంకడిది ఇంకా పెళ్లి వయసు కాదు. పెళ్లాం కావాలన్న కోరికా పుట్టలేదు... కాని, గడిచిన ఆరేడు నెలలుగా వాడి మనసులో తిష్ట వేసుకుని కూర్చుంది ఒక బొమ్మల బుష్ షర్ట్. దాన్ని మొదటిసారిగా, సూరిగాడి ఒంటి మీద చూసినప్పుడే వాడి మనసుకి గాలం వేసి, తనవైపు లాక్కొంది. ఆ వెనుక అటువంటిదే ఇంకొక చొక్కా బజార్లో కొట్టు మీద హేంగర్‌కి వేలాడుతూ కంటపడినప్పుడు, దానిమీద మోజుతో వాడు నిజంగా పిచ్చివాడు అయ్యాడు. ఎలాగైనా దాన్ని కొనుక్కోవాలని రాత్రి పగలు కలలు కనడం మొదలుపెట్టాడు. దానికోసం నోరు కట్టుకొని పైసా, పైసా కూడబెట్టడం చేశాడు.

"సవితి పండక్కి సొక్కా కొందామని" అన్నాడు, ఆమె తన డబ్బు చూసింది, తల్లికి కాని చెప్పి పోతుందేమో అనే కంగారులో రేకు పెట్టెలోకి ఎత్తి పోసుకుంటూ.

అన్నిరోజుల వాడి నిరీక్షణ ఆ రోజుతో ముగింపుకి రాబోతోంది. అప్పటికే వాడి పెట్టెలో తొమ్మిది రూపాయల చిల్లర కూడబడింది. ఇంకా ఒక్కటంటే ఒక్కటే రూపాయి తక్కువగా ఉంది. ఆరోజు ఎలాగైనా దాన్ని సంపాదించి "పది" పూర్తి చెయ్యాలి. ఆ బొమ్మల చొక్కా తనది చేసుకోవాలని వాడు మహా ఉబలాటపడ్తున్నాడు.

చొక్కా ఆ రోజు కొన్నా, దాన్ని సవితి పండుగదాకా తల్లికి చూపడు. ఆ రోజు స్నానం చేసి, పుట్టలో పాలు పొయ్యడానికి వెళ్లేముందు అప్పుడే తొడుక్కుంటాడు. "కొత్త సొక్కా ఎక్కడిదిరా గొల్లిగా?" అంటుంది తల్లి ఆశ్చర్యంతో. అప్పుడు చెప్తాడు తను ఆ బొమ్మల చొక్కా కథ. అది కొనుక్కోడానికి తను నోరు కట్టుకొని పైసా పైసా కూడబెట్టిన విధం అంతా.

"ఒరే సిట్టీ, నీ బొట్టెడు గట్టోడేనే. ఇప్పుడే ఇంతింత ప్లాన్లేస్తున్నాడు పెద్దోడైతే ఇంకెన్ని బుద్ధులు నేరుస్తడో?" అంటాడు తండ్రి మెచ్చుకోలుగా తన వంక చూసి.

ఆలోచనలు వెంకడి మనసుని ముందుకు తోస్తున్నాయి. వాడి కాళ్లని బజారు వీధికి లాక్కుపోతోంది.

అల్లంత దూరంలోనే కనిపించింది బట్టల కొట్టు. ఆత్రంగా అటు ఇటు వెతుకు లాడాయి వాడి కళ్లు. రోజూ ఉండేచోట ఆ బొమ్మల చొక్కా లేదు. వాడి స్వప్నం కరిగిపోయింది.

వాడి స్వర్గం తొలగిపోయింది. వాడి గుండె వేగంగా కొట్టుకుంది. వాడి రెండు కళ్ళూ నీటితో నిండిపోయాయి.

ఇంక దేనికోసం వాడు ఎదురు చూడాలి? ఏది పొందడానికి డబ్బులు కూడ బెట్టాలి? ఆ కొట్టువాడు అంతకి ముందురోజే చెప్పాడు. 'కావాలంటే, మీ అయ్యని డబ్బడిగి తెచ్చి, ఈ రోజే కొనుక్కుపో. అలాంటిది అది ఒక్కటే ఉంది. ఇంకెవరైనా కొనుక్కు పోగలరు' అంటూ.

అది అమ్ముడు పోకుండా అప్పటివరకు వెంకడి కోసం ఆర్నెల్లకి పైగా ఆగింది. వాడి చేతిలో డబ్బు కూడబడి, అది వాడిది అయ్యే సమయంలో అప్పుడే అన్యాయంగా వాడిని మోసగించి, ముఖం చాటు చేసుకుంది.

భ్రాంతి తీరక ఆ కొట్టు వైపు చూస్తూ ఇంకా అలాగే బొమ్మలా నిలబడిపోయాడు వెంకడు. అంతలో నీళ్లు నిండిన వాడి కళ్లపై ఏదో వెలుగు పడింది. అది క్షణంలోనే పంచరంగుల హరివిల్లుగా మారింది.

ఆ బొమ్మల చొక్కా అమ్ముడు పోలేదు. ముందుండే చోటు మార్చుకుంది. ఈ పక్క నుండి కొట్టుకి ఆ పక్కకి వెళ్లి, అక్కడి నుండి వెంకడి కోసం ఎదురు చూస్తోంది. 'ఇదిగో... ఇదిగో.... నేను ఇక్కడ ఉన్నాను. నువ్వేం కంగారు పడకు' అంటూ గాలికి అటు ఇటు ఊగులాడుతోంది.

వడివడిగా అడుగులు వేస్తూ అక్కడికి చేరుకున్నాడు వెంకడు. అది అలా తన చోటు మార్చుకొని వెంకడిని కంగారు పెట్టడానికి కారణం, అంతకు పూర్వం ఆ షాపులో పనిచేసే కుర్రాడు సెలవు మీద ఊరికి వెళ్లాడు. కొత్తగా వచ్చిన నౌకరు కుర్రాడికి దాని స్థానం ఎక్కడో సరిగా తెలియక కొట్టుకి అటుగా అద్దాల బీరువాలో పెట్టాడు.

వాడు బీరువా అద్దాలు తుడుస్తుంటే, చేయి తగిలి అది కిందపడింది. ఉన్నపాటున తను నేలమీదపడి, తలకి బొప్పి కట్టినంతగా బాధపడ్డాడు వెంకడు. చొక్కా అలా జారిపడ్డంతో, దానికి తగిల్చి ఉన్న వెల చీటీ ఊడిపడింది. ఆ నౌకరు కుర్రాడు దాన్ని తీసి, గుండు సూదితో మెడ దగ్గర గట్టిగా గుచ్చి పెట్టాడు. వాడు గుండు సూదితో చొక్కాకి గుచ్చుతుంటే ఎవరో తన పీకని కత్తితో కోస్తున్నట్లు విలవిల్లాడి పోయాడు వెంకడు. "నెమ్మదిగెట్టు, సొక్కా సిరిగిపోతది" అన్నాడు చూస్తూ ఊరుకోలేక. చేస్తున్న పని ఆపి వాడు వెంకడి వంక వింతగా చూసాడు 'ఎవడ్రా వీడు?' అన్నట్లు.

"ఏట్రా అధికార్లా ఆర్డరు సేత్తున్నావు? ఇది నీ అబ్బగాడి సాపేటి?" అన్నాడు.

"సాపు నా అబ్బది కాదు కానీ, ఆ సొక్కా నాది" అన్నాడు వెంకడు తడుము కోకుండా.

"ఏటీ! ఈ సొక్కా నీదా? ఎప్పుడు కొన్నావేటి?" అన్నాడు వాడు పొట్ట చెక్కలు అయ్యేలా నవ్వుతూ.

చిరిగి పీలికలైన తన చొక్కావంకా, ఇల్లు అలికే గుడ్డలా మట్టికొట్టుకుపోయి ఉన్న తన చెడ్డీ వంకా చూసుకున్నాడు వెంకడు. ఆ కుర్రాడి నవ్వు వాడి మనసులో మంటలు

రేపింది. అభిమానం వాడి కళ్లల్లో నీళ్ళు నింపింది. కానీ... కానీ... తన రేకు పెట్టెలో పది రూపాయలు కూడాక ఆ బొమ్మల చొక్కా తను కొనుక్కుపోయిన్నాడు అప్పుడు చూడాలి వీడి ముఖాన్ని అనుకొన్నాడు.

"దీని వెలెంతో నీకు తెలుసా? పన్నెండు రూపాయలు" అన్నాడు వాడు తను గుచ్చుతున్న చీటీ వైపు చూస్తూ.

"ఏటీ.... ఏటీ... పన్నెండా? మరి మా సూరిగాడు పదెట్టికొన్నానంటిడే?"

"ఆ ఏల అంతే... ఉప్పుడు పెరిగిపోనాది. మర్నాన్నాలు పోతే పదేను అయిపోతది కూడా. పన్నెండా? అంటూ అంతలా ఆశ్చరిపోతున్నావు. పదైతే మాత్తరం కొండానికి నీ దగ్గర డబ్బుందేటి?" అన్నాడు షాపు కుర్రాడు ఎగతాళి చేస్తూ.

"నాకాడ తొమ్మిది రూపాయలున్నాయి. ఇంకొకట కూడితే పదౌతది."

"కొయ్... కొయ్" అన్నాడు వాడు.

"నమ్మకపోతే సూసుకో" అంటూ తన చిన్న రేకు పెట్టె తెరిచి చూపించాడు ఎంకడు.

"సానా కూడెడితే ఏటిసేత్తవు?"

"బూట్ పాలిష్. రోజూ సందేల బువ్వకి మాయమ్మకి ఒక రూపాయిత్త. మిగిలిన సిల్లరంతా నాదే. రెన్నెల్ల పొద్దుగ చనక్కాయలైనా కొనుక్కోలా. సవితి పండుక్కి సొక్కా కొందామని అంతా కూడెద్తున్నా."

"సర్లే అయితే ఓ పనిసెయ్యి. సందేలకిరా. మా సావుకారుతో సెప్పి, నీకా బొమ్మల సొక్కా పది రూపాయలకే ఇప్పిత్తా" అన్నాడు ఆ కుర్రాడు.

"నిబద్దిగా" అన్నాడు వెంకడు ఉత్సాహంగా.

"మాటంటే మాటే. అయితే నువ్వియాలే కొనుక్కోవాల. రేపైతే మల్లి రేటు పెరిగి పోతది" అన్నాడు వాడు.

'సందేల దాకెందుకు మద్దినేలకే వత్త' అనుకొన్నాడు వెంకడు. ఆ రోజు తల్లికి అలవాటుగా ఇచ్చే రూపాయి ఇవ్వకుండా తన్నులు తింటానికి సిద్ధపడ్డాడు వాడు.

ఆ రోజు ఏదో సెలవు రోజు. రోడ్ల మీద జనం అట్టేమంది తిరుగాడ్డం లేదు. సాయంకాలం కావస్తున్నా బేరాలు రాలేదు. "అయ్యా పాలిష్ బాబూ పాలిష్, పాలిష్ సార్... బూటు పాలిష్" అంటూ తనని దాటుకుపోతున్న ప్రతిమనిషినీ, వాడి కాలుకి పాలిష్ చేయవలసిన జోడు ఉందా, లేదా? అనే ధ్యాస లేకుండా నోరు చించుకుని అడుగుతున్నాడు వెంకడు.

చాలామంది వాడి మాటని చెవిని పెట్టకుండానే వెళ్లిపోతున్నారు. మరికొందరు, వాడిలో ఆశలు లేపుతూ క్షణకాలం అక్కడ తటపటాయించి, ఈరోజు సెలవరోజేకదా, రేపు చేయించుకుంటే సరి అనుకొని వెళ్లిపోతున్నారు. వెంకడి మనసులో దిగులు ముసురుకొంటోంది. వాడి కళ్ల ముందు బొమ్మల చొక్కా వయ్యారంగా, వాడిని 'రా రమ్మ'ని

పిలుస్తోంది. 'చూడు... చూడు.... నేనెంత అందంగా ఉన్నానో' అని ఊరిస్తోంది. 'ఆ పది రూపాయలు కొట్టువాడి ముఖాన కొట్టి, నన్ను నీ స్వంతం చేసుకో, ఈరోజు దాటిపోతే నన్ను ఇంకెవరైనా ఎగరేసుకుపోగలరు' అని హెచ్చరిస్తోంది.

ఒకరోజు కొట్టు తుడిచి బట్టలు సర్దే కుర్రాడికి పది పైసలు లంచం పెట్టి, ఆ బొమ్మల చొక్కాని చేతితో తాకి చూసాడు వెంకడు. ఆ స్పర్శకి వాడి ఒళ్లు ఆనందంతో పులకలెత్తింది. వాడి మనస్సు పుష్పక విమానమెక్కి ఏడేడు లోకాలు తిరిగి వచ్చింది. కడుపు పగిలేలా పది పిండి వంటలతో పండుగ భోజనం చేసినంత తృప్తి కలిగింది. పైన ఎలక్ట్రిక్ పంఖా తిరుగుతూంటే మెత్తని బూరుగు దూది పరుపు మీద, బాగా పొద్దెక్కేవరకూ ఒళ్లు మరచి నిద్రపోయినంతటి హాయి కలిగింది వాడికి!

ఆనాటి నుండి ఆ పంచరంగుల బొమ్మల చొక్కా వాడి ఊపిరై కూర్చుంది. రాత్రీ, పగలు అదే వాడి జీవితం అయిపోయింది. ఈనాడు, అది చేతి కందేంత దూరం వరకు వచ్చి, ఇప్పుడు చేయి జారిపోతే, ఆ బాధని వాడు భరించలేడు. నిరాశని వాడు సహించలేడు. అందుకే అరుస్తున్నాడు పిచ్చిపట్టిన వాడిలా. 'అయ్యా బూట్ పాలిష్... బాబూ బూట్ పాలిష్' అంటూ.

వెంకడు నిరాశతో కుంగిపోతున్న సమయంలో జతగా వచ్చారు ఇద్దరు మనుషులు. పేంటూ, షర్టూ, చేతిలో ఏదో పుస్తకం. ఇద్దరూ కాలేజీ కుర్రాళ్ళల్లా ఉన్నారు. ఒకడు కాస్త పొడుగు, ఒకడు పొట్టి.

వెంకడి అరుపులు విని క్షణకాలం అతడి ముందు ఆగారు. ఆశతో వెంకడి కళ్లు మిలమిల మెరిసాయి.

అంతలో పొట్టివాడు "రేపు చేయించుకోవచ్చురా" అంటూ ముందుకి కదిలాడు.

"సార్... సార్ ఉదయం నుండి బోణీ లేదుసార్. ఒక్క పాతిక పైసలు సార్" అంటూ వాళ్ల వెంటపడ్డాడు వెంకడు.

"ఏమిటీ? బూట్ పాలిష్‌కి పాతిక పైసలా? ఇదేం మద్రాసు, హైదరాబాద్ అనుకుంటున్నావా? ఆ వీధిలో కుర్రాడు పది పైసలకే చేస్తున్నాడు" అన్నాడు రెండోవాడు.

"కిట్టదుబాబూ! అన్నీ పిరమైపోనాయి."

"సరే.... పదిహేను చేసుకో" అన్నాడు పొట్టివాడు.

"బేరం సెప్పడం లేదుబాబూ! అంతా అలాగే ఇస్తున్నారు."

"సరే నువ్వన్న పాతిక పైసలు ఇస్తాం. కాని బాగా చెయ్యాలి."

"అద్దంలా మెరిసేలా సేత్తాను బాబూ, తమరే సూద్దురుగాని" అంటూ వెంకడు ఉత్సాహంగా తన పనికి ఉపక్రమించాడు.

నిజానికి వెంకడు బ్రష్ పెట్టక పూర్వమే ఆ కుర్రాళ్ల జోళ్లు, అప్పుడే షాపులో కొన్నంత కొత్తగా నిగనిగ లాడుతున్నాయి. వాడు తన దగ్గర ఉన్న చవుకబారు రంగు పూసి,

ఊకలు ఊడిపోయిన బ్రెష్‌తో వాటిని పాలిష్ చేసేసరికి, అవి మరకలు పడి, మకమక లాడుతూ అయిపోయాయి. అయినా వాళ్ళు వాళ్ళ మాటల్లో పడి, అదేం పట్టించుకోలేదు.

"అయిపోనాది బాబూ" అని వెంకడు అనగానే, ఇద్దరిలో పెద్దవాడు, డబ్బు ఇవ్వడానికి జేబులో చెయ్యిపెడుతూ, "చిల్లరుందిరా?" అన్నాడు.

"ఎంతకి సార్?" వెంకడు ప్రశ్నించాడు.

"పది రూపాయల నోటుకి."

"లేదు సార్."

"లేకపోవడమేమిటి? మేము వచ్చేసరికి అంత చిల్లర పోగుపోసుకుని, లెక్క పెడ్తున్నావు?"

"అయి తొమ్మిది రూపాయలే సార్."

"చూడరా. మరో అర్ధ రూపాయి ఉంటే లెక్క సరిపోతుంది."

"లేదుబాబూ లేదు నా కెరికే. నాకాడ పదుంటే ఈపాటికి బొమ్మల సొక్కా కోసం పరుగెట్టనా?" అన్నాడు వాడు దిగులుపడ్తూ.

"బొమ్మల చొక్కా ఏంటిరా?" పొట్టివాడు ప్రశ్నించాడు.

వెంకడు ఉత్సాహంగా ఆ కథంతా చెప్పాడు. ఆ రాత్రి దాటిపోతే దాని వెల పెరిగిపోయే విషయం చెప్పాడు. ఆ షాపులో కొత్తగా చేరిన పనికుర్రాడు తన యజమానితో చెప్పి, దాన్ని పాత వెలకే తనకి ఇప్పిస్తానన్న సంగతి చెప్పాడు.

పది రూపాయల నోటు వెంకడి పెట్టె ముందు పడేశాడు పెద్దవాడు.

"నాకాడ సిల్లర లేదని సెప్తున్నా కద బాబూ! తమరే ఇంకోనోట మార్చి ఇయ్యండి" అన్నాడు వెంకడు నమ్రతగా.

"ఫరవాలేదు. నీదగ్గర ఉన్న ఆ చిల్లర ఇచ్చి, ఈ నోటు తీసుకో, అర్ధ రూపాయి కోసం ఇప్పుడు ఎక్కడికోపోయి మార్చుకొచ్చే ఓపిక లేదు" అన్నాడు అతడు.

ఆ మాట నమ్మలేనట్లు అతడివంక చూసాడు వెంకడు.

"నిజంగారా.... తీసుకో... అదేదో ఆ బొమ్మల చొక్కా కొనుక్కొని, నా పేరు చెప్పుకొని తొడుక్కో" అన్నాడు.

వెంకడు ఉత్సాహంగా తన రేకు పెట్టెలోని చిల్లర అంతా వాళ్ల ముందు పోసి, "నెక్క చూసుకోండి బాబు" అన్నాడు.

"ఫరవాలేదురా. నువ్వు లెక్కపెట్టిందే కదా" అంటూ ఆ చిల్లరని జేబురుమాల్లో భద్రంగా మూటకట్టాడు పొట్టివాడు.

"పండుగ మూడు రోజులు అన్ని బట్టలకి బాగా ధరలు తగ్గించి అమ్ముతున్నారు. సరిగా చూసి, బేరమాడి కొనుక్కో" అంటూ వెంకడికి జాగ్రత్త చెప్పాడు పెద్దవాడు.

తనకి అయాచితంగా అర్ధ రూపాయి డబ్బులు వదలిపోతున్న ఆ ఇద్దరి వంక కళ్ళలో కృతజ్ఞత నింపుకుని చూసాడు వెంకడు. వాళ్లు వెళ్లిపోయారు. వెంకడి చేతిలో సరికొత్త

పది రూపాయల నోటు రెపరెప లాడుతూ మిగిలిపోయింది. ఆ నోటు వంక, అప్పుడే ప్రసవించిన తల్లి, తన ప్రేమఫలం అయిన పసిపాపని చూసుకొన్నంత ముచ్చటగా చూసుకున్నాడు వెంకడు.

అంతకిపూర్వం కొన్ని పర్యాయాలు తన దగ్గర బూట్ పాలిష్ చేయించుకున్న పెద్దవాళ్లు, పర్సులోంచి చిల్లర డబ్బులు తీస్తుంటే, పదిరూపాయల నోటుని వాడు చూడ్డం అయితే చూసి ఉన్నాడు కాని, స్వయంగా తన చేతులతో పది రూపాయల నోటుని వాడు తాకడం, అందునా ఆ నోటు తన స్వంతం కావటం వాడు ఏనాడూ కలలో కూడా ఊహించుకోలేని అనుభవం అది.

చేతిలో నోటు మనసులో కోర్కెని తొందర చేసింది. ఇంకా కొంచెం పొద్దున్నా బేరాల కోసం ఎదురు చూస్తూ, అక్కడ కూర్చోవాలనిపించలేదు వాడికి. ఆ రాత్రి తల్లి తిండి పెట్టకపోయినా, తండ్రి చేత తన్నులు తినవలసి వచ్చినా ఆ రోజు, ఆ పది రూపాయలు పెట్టి బొమ్మల చొక్కా కొనవలసిందే అనే నిర్ణయానికి వచ్చాడు వాడు.

వాడు తన సామాన్లు సర్దుకుని లేవబోతుంటే అంతకు గంట నుండి ఆ పక్కనే రాతి బెంచీ మీద కూర్చున్న ఒక బొర్ర మీసాల ఆసామి వెంకడి ముందుకు వచ్చి, "పాలిష్ చెయ్యరా" అన్నాడు నిర్లక్ష్యగా పాతిక పైసల నాణెం వాడి ముందు విసిరికొడ్తూ.

"నానింటికి పోతున్నా బాబూ. ఇంకోరిసేతనైనా చేయించుకోండి" అన్నాడు వెంకడు పెట్టి మూత వేస్తూ.

"ఏంరా? ఒంటికి కొవ్వెక్కిందేంటి? లేక డబ్బు చేదయిందా? పావలా ఇస్తాను. పాలిష్ చెయ్యరా అంటే ఇంటికి పోవాలని చెడ నీలుగుతున్నావు" అన్నాడు ఆ ఆసామి గదమాయిస్తూ.

ఇంక తప్పదన్నట్లు సర్దుకొన్న పెట్టిలోంచి బ్రెష్, పాలిష్ వగైరా సామాన్లు మళ్లీ బైటికి తీసి, అతడి జోడుకి పాలిష్ చేసాడు వెంకడు. 'పోనీలే ఇదీ మంచిదే. ఆ పావలా డబ్బులు పెట్టి ఏదైనా కొనుక్కుతిని, ఈ రాత్రికి ఎలాగోలాగ గడిపేయవచ్చు' అనుకొన్నాడు.

ఆ బుర్రమీసాల ఆసామి వెళ్లిపోయాక, వెంకడు తన పెట్టి సర్దుకుని, లేవబోతుంటే, అతడు అంతవరకు కూర్చున్న రాతి బెంచీ మీద ఒక చిన్న నల్లని ప్లాస్టిక్ సంచి ఒకటి కనిపించింది. దాన్ని చూడగానే అది ఆ ఆసామిదే అని నిర్ణయించి, "సార్... సార్" అంటూ పిలుస్తూ అతడు వెళ్లిన దిక్కుగా పరుగుపెట్టాడు వెంకడు.

అతడు అట్టే దూరం పోలేదు. వెంకడి పిలుపు విని వెనుతిరిగి చూసాడు. వాడి చేతిలో తన సంచిని చూడగానే అతడి ముఖం వికసించింది.

"అక్కడ కూర్చున్నప్పుడు జారిపోయి ఉంటుంది. నువ్వు మంచివాడివి కాబట్టి తెచ్చి ఇచ్చావు. ఇదే ఇంకొకరి కంటపడితే ఇంక అంతే సంగతులు" అన్నాడు అతడు.

"ఈ కుర్రాడెవరో ఉత్తి అమాయకుడులాగా ఉన్నాడు. ఈ కాలంలో చేతపడ్డ వస్తువును తిరిగి ఇచ్చే వెర్రి వెంగళాయిలు ఎవరుంటారు?" అన్నాడు ఆ పక్కనే ఉన్న ఇంకొక వ్యక్తి.

వెంకడికి వాళ్ల పొగడ్తలు వింటూ కూర్చునే సమయం లేదు. వాడి దృష్టి అంతా అక్కడికి నాలుగు వీధుల అవతల, బజారు వీధిలో హేంగరుకి వేలాడుతున్న బొమ్మల చొక్కా మీదే ఉంది.

"వస్తా సార్" అంటూ వాడు వెనుతిరిగి పోబోతుంటే, "ఉండరా ఉండు నా సంచి తెచ్చి ఇచ్చావు. నీకేమైనా ఇస్తా" అంటూ ఆ ఆసామి ప్లాస్టిక్ సంచి తెరచాడు. అంతలోనే తేలు కుట్టిన వాడిలా ముఖం పెట్టి, "ఇందులో పది రూపాయల నోటేదిరా?" అన్నాడు వెంకడి జుట్టు పట్టుకొంటూ.

"నాకు తెలీదు సార్. నాను తెరిసి సూళ్లేదు" అన్నాడు వెంకడు భయంగా.

"దొంగవెధవా. నువ్వు తియ్యకపోతే, ఇందులో ఉండే నోటు ఇప్పటికిప్పుడు ఎక్కడికి ఎగిరిపోతుందిరా?"

"ఏమో బాబూ, మాయమ్మ తోడు. భగవంతుడి సాచ్చిగా నాకే పాపం తెలవదు. నాను సూడ్డం కూడా సూడలేదు" అన్నాడు బెదిరిపోతూ.

"అలా మాటలతో నెమ్మదిగా అడిగితే పైకిరాదు. రెండు అంటిస్తే" పక్కగా ఉన్నవాళ్ళు సలహా ఇచ్చారు.

"ఇప్పటికిప్పుడు ఎక్కడ దాస్తాడు? వెతికి చూడండి. అదే దొరికిపోతుంది" ఇంకొకరి ఆలోచన.

వాడి చొక్కా, పాలిష్ పెట్టెలో ఉన్న సామాన్లన్నీ నేలపై పడేశారు. వాడి చింకి చొక్కా బురద లాగూ జేబులన్నీ వెతికారు. ఎక్కడా కనిపించలేదు.

"ఇదిగో... ఇదిగో... ఇందులో ఉంది". చిన్న రేకు పెట్టెలో పదిలంగా మడిచిపెట్టిన పది రూపాయల నోటుని ఎవరో బైటికి లాగారు.

"అమ్మ దొంగవెధవా! అమ్మతోడు, అయ్యతోడు అంటూ అమాయకుడిలా ఏం వేషాలు వేసేవురా?"

"అది నాది బాబూ... నాది" ఆత్రంగా నోటుని అందుకోబోయాడు వెంకడు.

"అవున్రా నీదే. పాపం చాలా కష్టపడి ఆర్జించావు మరి" ఎవరో హేళన చేశారు.

"నిబద్దిగా... అది నాదే. అది సంచిలోంచి తీసింది కాదు. కావాలంటే ఆ బాబునే అడగండి. ఆరికి ముందు పాలిస్ చేయించుకొన్న అయ్యలు నాకాడ సిల్లరంతా తీసుకొని ఆ నోటు ఇచ్చారు. సవితి పండుక్కి బొమ్మల సొక్కా కొనుక్కోవాలని నాను పైస పైస కూడబెట్టుకొన్న డబ్బులు అయి. సత్తె పెమాణికంగా సెప్తున్న. ఆ నోటు నాదే సార్. నాను దొంగను కాను బాబూ. అది నాది... అది నాది" అంటూ వెంకడు తల మొత్తుకుని ఏడుస్తున్నాడు.

కాని, వాడి మాటలు ఎవరు వింటారు? వాడు చెప్తున్నది నిజమని ఎవరు నమ్ముతారు?

"దొంగవెధవ, చేసిన పని చాలక పైగా ఏడుపు కూడా. నాలుగు తన్నీ తగిలిస్తే మళ్లీ ఇటువంటి పని చెయ్యడు."

మందిలో ఎవరినోటో ఆ మాట వచ్చిందే తడవుగా, నలుగురూ మూగి చేయికొచ్చిన దెబ్బ వేశారు. కాలి కందిన తాపు తన్నేరు. అంతలో సొమ్ము పోగొట్టుకున్న ఆసామీ కల్పించుకొని "ఇంక వాడిని వదిలేయండర్రా. చచ్చూరుకుంటాడు. మన సొమ్ము మనకి దొరికింది కదా" అని జాలిపడుతూ వారిని ఆపుచేసేసరికి, అప్పటికే వెంకడి ఒళ్లు హూనం అవనే అయింది. వాడి ఏ కీలు కాకీలు విరగనే విరిగింది.

మంది కదిలిపోయింది. పొద్దువాలిపోయింది. కుమిలి, కుమిలి ఏడుస్తు వెంకడు అక్కడే పడి ఉండిపోయాడు. క్షణకాలం ముందు వాడి కళ్ల ముందు నిల్చిన పంచ రంగుల సుందర జీవితం అంతలోనే కూలిపోయింది. మరికొంచెంసేపులో వాడు, తన చేతుల్లోకి వస్తుంది అనుకొన్న బొమ్మల చొక్కా, ఇప్పుడు అందని చందమామ అయిపోయింది. మళ్లీ అంత సొమ్ము తనెక్కడ కూడబెట్టగలడు?

కూడబెట్టినా అప్పటివరకు ఆ చొక్కా అమ్ముడు పోకుండా ఆగి ఉంటుంది అన్న నమ్మకం ఏమిటి? పొద్దుపోయేవేళకి పది రూపాయలు పట్టుకొస్తే, ఆ బొమ్మల చొక్కా నీకు పాత రేటుకే ఇప్పిస్తానంటూ ఆ నౌకరు కుర్రాడు చెప్పిన మాట గుర్తువచ్చి, బోరుబోరున ఏడ్చాడు వెంకడు. ఏడ్చి, ఏడ్చి అలసిపోయాడు.

అంతలో అంతకి పూర్వం పది రూపాయల నోటు తనది అంటూ లాక్కుపోయిన ఆసామి అటువైపు తిరిగి రావడం చూసాడు. అల్లంత దూరంలో అతడిని చూస్తూనే వెంకడి కళ్లు ఆనందంతో మెరిసాయి. బహుశా అతడికి తన డబ్బు దొరికి ఉంటుది. లేక దేనికైనా ఖర్చు పెట్టినట్లు జ్ఞాపకం వచ్చి ఉంటుంది. తన నోటు తనకి ఇవ్వడానికి అతడు తిరిగి వస్తున్నాడు.

కొన్ని నిమిషాల కిందట వాడి ఒంట్లో ఇటునుండి అటు తిరిగేపాటి శక్తి లేదు. కాని ఇప్పుడు పరుగు పెట్టడానికి తగినంత బలం వచ్చింది.

"బాబూ.... బాబూ... బాబుగారూ" అంటూ అతడికి ఎదురుగా పరుగు తీసాడు. అతడు ఒంటరిగా లేడు. వెంట ఒక పోలీసు ఉన్నాడు.

"పోలీసు" అన్న మాట వింటేనే వెంకడికి చచ్చేంత భయం. ఇంక ఎదురుగా పోలీసుని చూడ్డం అంటే సింహస్వప్నమే! పరుగుతో ముందుకు పోతున్న వాడల్లా అంతే వేగంతో వెనుతిరిగి కాలికి బుద్ధి చెప్పాడు.

"అదిగో.... అదిగో... వాడే.... వాడే... పారిపోతున్నాడు పట్టుకోండి" అంటూ కేకలు పెట్టాడు బుర్రమీసాల ఆసామి పక్కనున్న పోలీసువాడితో.

పోలీసు ఒక్క పరుగుతో ముందుకు ఉరికి వెంకడి జబ్బ పట్టుకున్నాడు. వెంకడి పై ప్రాణం పైనే పోయింది. కాళ్లూ, చేతులూ గడగడ వణికి పోయాయి. "ఈ నోటు నీదేనా?" పది రూపాయల నోటు వెంకడి కళ్ల ముందు ఆడిస్తూ అడిగాడు పోలీసు వీరాస్వామి.

"నాదే సార్... నాదే" అన్నాడు వెంకడు ఉత్సాహంగా.

వాడి చెంప ఛెళ్మంది. కళ్లముందున్న మనుషులు, రోడ్డు, రోడ్డు పక్కల చెట్లు అన్నీ తిరుగుతూ చక్కెర్లు కొట్టాయి. దెబ్బతిన్న చెంప వైపు చెవి గింగుర్లు పోయింది. కళ్ల నీళ్లు కుక్కుకుంటూ "సార్... సార్..." అన్నాడు వెంకడు, పోలీసువాడు తననెందుకు కొట్టాడో అర్థంకాక.

"దొంగనాకొడకా, వేలెడంతలేవు. అప్పుడే నీకిన్ని యవ్వారాలా? సెప్పరా సెప్పు. ఈ నోటు ఏడనుండి తెచ్చావు? ఇటువంటివి ఇప్పటికి ఎన్ని మారిసావు? నీతోపాటు ఇంకా ఎవరెవరున్నారు? సెప్పరా, దొంగనంజకొడకా" అంటూ మరి రెండు తగిలించాడు పోలీసువాడు.

వెక్కి వెక్కి ఏడుస్తున్న వెంకడు జవాబు చెప్పలేదు. పక్కగా నిలబడి తమాషా చూస్తున్న బుర్రమీసాల ఆసామి మాట అందుకున్నాడు.

"దారిన నా మానాన నేను పోతుంటే, 'బాబూ పది రూపాయల నోటుకి చిల్ల రుందా?' అని అడిగాడు. నేను అప్పుడే అనుమానించాను. ఈ చింకి గుడ్డల మడ్డి వెధవ దగ్గరికి ఈ కొత్త నోటు ఎలా వచ్చిందా అని. సర్లే ఎవరో మార్చి పట్టుకు రమ్మని ఇచ్చి ఉంటారు అనుకుని నాలుగు రెండు రూపాయల నోట్లు మిగిలింది చిల్లరా ఇచ్చాను. నాకు అవసరంపడి, తీరా బజారుకి పోయి మార్చబోయేసరికి అప్పుడు తెలిసింది, ఇది దొంగనోటని". బుర్రమీసాలవాడు అమాయకంగా ముఖం పెట్టి పోలీసువాడితో కథ చెప్తున్నాడు.

ఆ పెద్దమనిషి ఆ నోటు తనదే అంటూ వెంకడికి రేకు పెట్టెలోంచి లాక్కొని, వాడిని చితక కొట్టించడం చూసిన ప్రేక్షకులు అప్పుడు అక్కడ లేరు. ఇప్పుడు గూమిగూడిన కొత్త ప్రేక్షకులకు ఈ కథ నచ్చింది.

"ఈ రోజుల్లో ఇటువంటి గుంట వెధవలు చెయ్యని నేరాలంటూ లేవు" అంటూ తమ తమ అనుభవాల్లో జరిగిన, లేక జరిగినట్లు విన్న దొంగతనాల్ని, మోసాల్ని కథలుగా అంతా వర్ణించి చెప్పడం మొదలుపెట్టారు.

వెంకడు వాడి జీవితంలో పది రూపాయల నోటుని అంత దగ్గరగా చూసింది అప్పుడే. మనుషుల్లో మంచి మనుష్యులు, చెడ్డవాళ్లు ఉన్నట్లు నోట్లల్లో కూడా మంచి నోట్లు, దొంగ నోట్లు ఉంటాయన్న సంగతి వాడికి తెలియదు.

పోలీసు వీరాస్వామి తన లాఠీ కర్రతో వాడి డొక్కల్లో ఎన్ని పోట్లు పొడుస్తున్నా, ఆ దొంగనోట్ల చలామణిలో ఇంకా ఎవరెవరు ఉన్నారో, వాడు ఒక్కపేరైనా చెప్పలేక పోయాడు.

"నీ పని ఇక్కడ కాదురా దొంగనాయాలా", స్టేషనుకి పద. ఎట్ట సెప్పవో నేనూ సూత్తా. నువ్వే కాదు నీ తల్లో జేజమ్మ దిగొచ్చి సెప్తాదిరా, ఈ వీరాసామి అంటే ఏటనుకొంటు న్నావో... పద... పద" అంటూ వెంకడి మెడపై చెయ్యిపెట్టి గట్టిగా ఒక తోపు తోసాడు వీరాస్వామి.

అంతమంది జనం ముందు తన అధికారం చూపించుకోడానికి, స్టేషనుకి పద అంటూ వెంకడిని గెంటుకుంటూ వెళ్లాడు కాని, నిజానికి వాడిని అక్కడికి తీసుకుపోయి, తన్ని తగిలించి వాడిద్వారా దొంగనోట్ల చెలామణి ముఠా ఆచూకి లాగాలనే కోరిక వీరాస్వామికి లేదు. వాడి ఆలోచన అంతా, ఆ పెద్దమనిషి ఇచ్చిన పది రూపాయల చిల్లరలో కొంత తరిగిపోయినా కొంతైనా ఇంకా మిగిలి ఉండకపోదు. అదికాస్తా జేబులో వేసుకొని, వాడిని నాలుగు చివాట్లు పెట్టి, దయతలచి వదిలినట్లు వదలి పెట్టాలని. కాని, తీరా వాడి రేకుపెట్టె తెరిచి చూస్తే, అందులో పాతిక పైసల పాత నాణెం తప్ప, ఇంకేం లేదు.

'ఇదేం పాడురోజో, ఈ రోజు చేతికి తగిలిన కేసులన్నీ ఇలాగే ఏడిచినాయి. వెధవల దగ్గర తంతే దమ్మిడీ ఉండదు. ఎలా బ్రతుకుతారో మరి.' అనుకుని ఆ నాణేన్ని జేబులో వేసుకుంటూ "పోరా ఎదవ నాయాలా, సిన్నోడివని ఈసారికి ఇడిసి పెడ్తున్నా, ఇంకోసారి సేతికి సిక్కేవంటే, మక్కెలిరగపొడుస్తా" అంటూ వాడిని హెచ్చరించి అక్కడి నుండి ముందుకు పోయాడు పోలీసు వీరాస్వామి.

వెంకడికి ఒక్కసారిగా ప్రపంచం మీద రోత పుట్టింది. తన దిక్కుమాలిన బ్రతుకు మీద రోత పుట్టింది. అన్ని బాధలకి తనని లోనుచేసిన ఆ పంచరంగుల చొక్కా మీద విరక్తి పుట్టింది.

అప్పుడు వాడికి తల్లి ఒడిలో తలపెట్టుకుని, మనసులో బాధ సమసిపోయేలాగా తనివితీరా ఏడవాలనిపించింది. ఏ రైలు కిందో తల పెట్టి చావాలనిపించింది. ఏ అడివి లోనో, ఎవ్వరూ మనుష్యులు లేనిచోటుకి పారిపోవాలనిపించింది.

కాని వాటన్నింటినీ తోసి రాజంటూ ముందుకొచ్చి కూర్చుంది ఇంకొక కోరిక. చావడానికి ముందుగా ఒక్కసారంటే ఒక్కసారి కళ్ల నిండుగా ఆ బొమ్మల చొక్కా చూడాలనే బలీయమైన కాంక్ష.

ఒంటిలో నడిచేశక్తి లేకపోయినా, నెమ్మదిగా కాళ్ళీడ్చుకుంటూ బజారు వైపు నడక మొదలుపెట్టాడు. ఆ అర మైలు దూరమే వాడి ప్రాణానికి ఆరు ఆమడల దూరంలా అనిపించింది. బజారు వీధిని చేరబోతూంటే ఇంక వాడి ఒంట్లో అడుగు తీసి, అడుగు వేసే శక్తి లేకుండా పోయింది. ఉదయం నుండి తిండి లేదు. పైగా తిన్న తన్నులు, ఒళ్ళంతా నొప్పితో లుంగలు చుట్టుకుపోతోంది. తల తిరిగిపోతోంది. ఉన్నపళంగా కళ్ళు చీకట్లు కమ్మి రోడ్డువార చెట్టు క్రింద తూలిపడ్డాడు.

తిరిగి వాడికి తెలివి వచ్చేసరికి రోడ్డు మీద జనసంచారం లేదు. షాపుల్లో లైట్లు లేవు. దారంట వచ్చే పోయే వాహనాల రొద లేదు. రోడ్డుపై ఉన్న లైట్ల వెలుగులో ఎదురుగా

కొద్దిపాటి దూరంలో ఆ బట్టల కొట్టు కనిపిస్తోంది. దానిముందు అద్దాల బీరువాలో ఉన్న రంగుల బొమ్మల చొక్కా వెంకడి కళ్ళకి మసక మసకగా కనిపిస్తోంది. అలా దానివంకే కన్ను పొడుచుకుని చూస్తుంటే, అక్కడ ఎవరో ఇద్దరు మనుషులు నిలబడి ఉండడం వాడి కళ్ళపడింది. 'కొంపతీసి వాళ్ళు ఆ చొక్కా కొనుక్కోడానికి రాలేదుకదా' అనే అనుమానం వెంకడి మనసులో కదిలింది. అదేకాని జరిగితే తను ఆ బొమ్మల చొక్కాని మళ్ళీ చూడలేడు. తన చివరి కోరిక తీరకుండానే చచ్చిపోవలసి ఉంటుంది.

వెంకడి మనసు గిలగిలా కొట్టుకుపోయింది. ఒంటిలోని శక్తిని, మెల్లగా కూడగట్టు కొంటూ నెమ్మదిగా అటు కదిలాడు.

వాడి అనుమానం నిజమే అయింది. ఆ ఇద్దరు వ్యక్తులు అప్పటికే అద్దాల బీరువా లోంచి కొన్ని బట్టలు తొలగిస్తున్నారు.

"సార్" అన్నాడు వెంకడు వాళ్ల పక్కకి చేరి.

వాళ్లు వెంకడు రావడం గమనించలేదు. వాళ్ళ తొందర్లో వాళ్ళు ఉన్నారు. వెంకడి పిలుపుతో చేస్తున్న పనిని ఆపి తుళ్ళిపడి వాడి వేపు చూసారు.

"ఎవడ్రా నువ్వు?" అన్నాడు ఆ ఇద్దరిలో ఒకడు వెంకడి మెడ పట్టుకుంటూ.

"ఎంకడ్ని సార్" అమాయకంగా తన పేరు చెప్పాడు ఎంకడు.

"ఇక్కడికెందుకొచ్చావు?" రెండోవాడు గద్దించాడు.

వెంకడు వారి గద్దింపు పట్టించుకోలేదు.

"ఆ సొక్కాలు, ఆ బట్టలు అయన్నీ మీవా సార్" అన్నాడు.

"అవున్రా, ఈ కొట్టు మాదే" ఇద్దరూ ఒక్కసారే కూడబలుక్కున్నట్లు అన్నారు.

"నాను రోజు ఈ సాపు ముంగలే సానా సేపు కూకుంటాను సార్. తవర్ని ఎప్పుడూ సూడలేదు" వాళ్ళ వంక పరిశీలనగా చూస్తూ అన్నాడు వెంకడు.

"మాకు కొత్తబజార్లో ఇంకో షాపుందిరా. ఈ కొట్టు మా అన్న చూస్తాడు. అక్కడికి కొన్ని బట్టలు కావల్సి వీటిని తీసుకుపోతున్నాం" ఇద్దరిలో పెద్దవాడు చెప్పాడు.

"సార్ సార్! ఆ బొమ్మల చొక్కా కూడా తీసుకుపోతున్నారా సార్" ఆ మాట అడుగుతుంటే వెంకడి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. వాడి గొంతు బొంగురు పోయింది.

"ఏం అలా అడుగుతున్నావు?" ఇద్దరిలో చిన్నవాడు ప్రశ్నించాడు.

వెంకడు, తను ఆ చొక్కా కొనుక్కోడం కోసం నెలల తరబడి డబ్బు కూడబెట్టిన సంగతి చెప్పాడు.

"సరే ఆ డబ్బులు ఇలాతే. ఈ చొక్కా నీ కిచ్చేస్తాను" అన్నాడు వాడు.

ఆ మాట వినగానే అంతవరకు వెంకడి గొంతులో కొట్లాడుతున్న దుఃఖం ఒక్కసారిగా జలపాతం నీటిరొదలా బైటికి పొంగుకొచ్చింది. బోరున గొంతెత్తి ఏడవటం మొదలుపెట్టాడు.

వాడి ఏడుపు విని ఎవరైనా అటు వస్తారేమోనని కంగారుపడ్డారు. కాని అటువంటిదేం జరుగలేదు. బాగా రాత్రి ముదిరింది. చలికాలం. అందునా బజరు వీధి. రోడ్డు మీద ఎవరూ తిరుగాడ్డం లేదు.

వెంకడు అలా ఏడుస్తూనే తను అంత కష్టపడి కూడబెట్టిన సొమ్ము ఎవడో కాజేసిన వైనం చెప్పాడు.

"ఆడు దొంగనా నేడు బాబూ, తమరినాగే ఇస్త్రీ బట్టల్లో సదువుకొనే బాబులా ఉన్నాడు."

ఆ వ్యక్తులిద్దరూ తుళ్ళిపడి ఒకరి ముఖం ఇంకొకరు చూసుకున్నారు. కళ్ళతోనే ఏవో సంజ్ఞలు చేసుకున్నారు. ఆ రంగుల బొమ్మల చొక్కాకి కట్టి ఉన్న చీటి మీద ధర చూసారు. దాని వెల మొదట పది రూపాయలు, ఇప్పుడు రెండు రూపాయలు తగ్గించి సీటీ పెట్టారు.

"ఇంద, దీన్ని తీసుకో" అంటూ ఆ చొక్కాని వెంకడి చేతిలో పెట్టాడు పెద్దవాడు.

"నాకాడ డబ్బులు నేవుసార్. అన్నీ పోనాయి" ఏడుస్తూ సమాధానం చెప్పాడు వెంకడు.

"ఫర్వాలేదు, తీసుకో. నీ డబ్బులు తీరేవరకు రోజూ ఉదయాన్నే వచ్చి మా పిల్లల జోళ్లు పాలిష్ చేసిపెడ్దువుగాని."

"మీ ఇల్లు ఏడుందిసార్?" ఉత్సాహంగా అడిగాడు వెంకడు చొక్కా అందుకుంటూ.

"రేపు మేమంతా ఊరికి వెళ్తున్నాము. తిరిగి వచ్చాక నిన్ను తీసుకుపోయి చూపిస్తాం" ఇద్దరిలో చిన్నవాడు జవాబు చెప్పాడు.

తన చేతిలో తానంతకాలంగా కలలు కంటున్న బొమ్మల చొక్కా. వెంకడు తన అదృష్టాన్ని తానే నమ్మలేకపోయాడు. "దీనిని ఒట్టిగా నాకిచ్చేస్తారా సార్" అన్నాడు.

"ఆ ఆ! ఇంక అది నీదేరా. ఇంటికి పట్టుకుపో. కానీ ఒక్క విషయం, ఇలా అది నీకు మేము ఇచ్చినట్లు ఎక్కడా ఎవరితోనూ చెప్పకూడదు. నీలాంటి గుంటలంతా తమకీ ఇమ్మని మా వెంటపడ్తారు."

"సెప్పను సార్... ఏరికీ సెప్పనుసార్" అంటూ వారికి రెండు చేతులెత్తి దండం పెట్టి, ఇంటి ముఖం పట్టాడు వెంకడు.

పడుతూ, లేస్తూ వెంకడు ఇల్లు చేరేసరికి రాత్రి కరిగి వెలుగు వస్తోంది. వెంకడి తల్లి అప్పటికే పాచిపని చెయ్యడానికి వెళ్ళిపోయింది. తండ్రి తాగుడికి డబ్బు లేకపోతేనే తప్ప రాత్రి పూట ఇంటికి చేరడు.

రంగుల బొమ్మల చొక్కాని అలాగే రెండు చేతులతో పట్టుకొని మంచం మీద పడ్డాడు వెంకడు. వాడి గుండెలకి అతి చేరువలో ఉన్న చొక్కాపై బొమ్మలు వాడికి నిద్రలో రకరకాల కథలు చెప్తున్నాయి.

వాడు అలా ఎంత సేపో ఒళ్ళు తెలియకుండా నిద్రపోయాడు. గుడిసెలో చీకటి పోయింది. గుడిసె బైట ఫెళ్ళున ఎండ కాస్తోంది. ఏదో బలమైన దెబ్బ డొక్కలో తగలడంతో వెంకడికి తెలివి వచ్చింది.

అలా వాడి డొక్కలో తగిలి, వాడికి మెలకువ తెప్పించింది పోలీసువాడి కాలిబూటు. తనపక్కనే ఉన్నాడు ముందురోజు తనతో బట్టలకొట్లో మాట్లాడిన కొత్త నౌకరు కుర్రాడు, వాడి పక్కనే షాపు యజమాని.

"వీడేసార్. నిన్న ఉదయం కొట్టుకాడ సానాసేపు తారట్లాడింది" అన్నాడు వాడు.

ఆ పోలీసువాడు అంతకి ముందురోజు వెంకడిని దొంగనోటు చెలామణి నేరంలో పట్టుకుని తన్ని తగిలించిన వీరాస్వామే!

"ఏరా దొంగనాకొడకా! పోనీ సిన్నోడివని నిన్నొదిలి పెడితే సాపులకే కన్నాలు ఏసేంత పెద్దోడివైపోనావా? నెగరా నంజకొడకా... నెగు" అంటూ వాడి పొట్టలో సూటిగా మరి రెండు తన్నులు తన్నాడు.

"ఏటిసార్? నాకేటి తెల్దు బాబూ! నేనేటి సేయనేదుసార్" అంటూ వెంకడు దెబ్బలకి తట్టుకోలేక ఏడవసాగాడు.

"నీకేటి తెలీకపోతే ఈ సొక్కా నీకాడికెలా వచ్చిందిరా నంజకొడకా."

బలంగా చేతిలో లాఠీతో మరి రెండు తగిలించాడు వీరాస్వామి.

"సత్తెం బాబూ! నాకేటి తెల్దు బాబూ, నాను దొంగనుకాను బాబూ! ఈ సొక్కా ఆ బాబులు ఇచ్చారు సార్. నాకాడ డబ్బులు నేవంటే అప్పు తీరేవరకు ఆరింటికి వచ్చి ఆరిపిల్లల బూట్లు పాలిస్ చెయ్యమన్నారు బాబూ! నా నబద్ధం చెప్పడం నేదుసార్. ఆ బాబుల్ని అడగండి సార్" వెంకడు గోడుగోడున ఏడుస్తూ చెప్తున్నాడు.

"ఈ అయ్యగారి సాపంతా దొంగలకి దోచిపెట్టి, పైగా ఆ సాపులో బాబులు నీకు సొక్కా ఇచ్చారని సెప్తావురా దొంగనాయాలా! పద... పద... స్టేషనుకి పద. ఈ కదంతా అక్కడ సెప్పవుగానీ" అంటూ నేలమీదపడి ఏడుస్తున్న వాడిని పైకిలాగి బలంగా ఒక్క తోపు తోసాడు పోలీసు వీరాస్వామి.

కాళ్లలో ఏ మాత్రం శక్తి లేని వెంకడు ఆ తోపుకి రోడ్డు మీద తూలిపడ్డాడు. వాడి చేతిలో ఉన్న రంగు రంగుల బొమ్మల చొక్కా పట్టువిడి పక్కగా ఉన్న మురుగు కాలవలో పడింది.

పోలీసు స్టేషన్‌లో లాఠీ దెబ్బలు తింటున్న వెంకడి ఎముకలు పటపట విరగ సాగాయి. కాలువ నీటిలో పడ్డ చవుకబారు బొమ్మల చొక్కా రంగులు కరిగి ఆ మురుగునీటితో మురికివాడంతా పారసాగాయి.

'ఈ రోజుల్లో దేన్నీ, ఎవర్నీ నమ్మడానికి లేదు. అంతా మోసం... అన్నీ మోసం అనుకున్నాడు' ఆ దారినే పోతున్న అమాయకుడు ఒకడు ఆ రంగుల్ని చూసి.